# దిగుబడి డల్.. ఆసక్తి నిల్

- మెట్టలో ఏటా తగ్గుతున్న జీడిమామిడి విస్తీర్ణం
- గిట్టుబాటు కాకపోవడంతో చెట్లను నరికేస్తున్న వైనం
- కొత్తగా మొక్కలు వేయడానికి ముందుకు రాని రైతులు


పాండవులపాలెంలో జీడిమామిడి తోట

**ప్రత్తిపాడు రూరల్:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఒకప్పుడు జీడిమామిడి పంటకు ఎంతో ప్రసిద్ధి. వేసవి కాలం వచ్చిందంటే జీడిమామిడి పంట రైతులు, వ్యాపారులు, కూలీలకు చేతి నిండా పని కల్పించి ఆర్థిక తోడ్పాటును అందించేది. కాలక్రమంలో కూలీల ధరలు, ఇతర ఖర్చులు పెరిగాయి. అదే స్థాయిలో జీడిమామిడి పిక్కల ధర పెరగకపోవడంతో దళారులకే ఈ పంట లాభసాటిగా మారింది. గిట్టుబాటు కాకపోవడంతో రైతులు జీడిమామిడి పంటను సాగు చేసేందుకు ఆసక్తిని చూపించడం లేదు. నియోజకకవర్గంలో పంట విస్తీర్ణం ప్రతి ఏడాది తగ్గుతూ వస్తోంది. రైతులు జీడి మామిడి పంట స్థానంలో నీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పామాయిల్, సరుగుడు పంటలను సాగు చేస్తున్నారు.

**6,067 హెక్టార్లలో సాగు**

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 6,067 హెక్టార్లలో రైతులు జీడి మామిడి సాగు చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలో 1,437 హెక్టార్లు, ఏలేశ్వరంలో 153 హెక్టార్లు, శంఖవరం 1,727, రౌతులపూడి 2750 హెక్టార్లలో జీడి మామిడి పంట సాగులో ఉంది. కాగా ఈ ఏడాది ధర కాస్త బాగున్నా దిగుబడి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఏప్రిల్ నుంచి జూన్ వరకూ..**

ఏటా ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకూ జీడి మామిడి పండ్లు లభ్యమవుతాయి. పూత పూయడానికి ప్రత్యేకంగా మందులున్నా కొద్ది మంది రైతులు మాత్రమే పిచికారీ చేస్తారు. జీడి పండుకు కింద భాగంతో గింజ ఉంటుంది. పచ్చి గింజలను మాంసాహారాల్లోనూ, కూరగాయల్లోనూ ఎక్కువగా వినియోగిస్తారు. అయితే పచ్చి గింజ కన్నా ఎండు గింజ పైనే మక్కువ చూపుతారు. పచ్చి గింజలను ఎండలో ఆరబెట్టి బాగా ఎండిన తరువాత బస్తాల లెక్కన హోల్ సేల్ వ్యాపారులకు విక్రయిస్తారు. జీడి పండ్లు కన్నా గింజలపైనే ఎక్కువగా ఆదాయం వస్తుంది. జీడిగింజలను కోసి ఆర బెట్టి వ్యాపారులకు అమ్మడం రైతుకు తలకుమించిన భారం అవుతోంది. పెట్టుబడి ఖర్చు పెరగడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు.

**ధర రావడం లేదని గగ్గోలు**

జీడి గింజలను కాల్చడం, బద్ద, పప్పులుగా వేరు చేయడం ఎంతో కష్టంతో కూడిన పనికావడంతో రైతులు తొలి నుంచి గింజల గానే అమ్మేస్తున్నారు. గతంలో కూలి రేట్లు తక్కువగా ఉన్నప్పుడు ఎంత వస్తుందో రేట్లు పెరిగిన తరువాత కూడా అంతే ధర పలకడంతో రైతులు గింజలను ఎండబెట్టి అమ్మేస్తున్నారు. ఎండిన గింజలు కింటాల్‌కు రూ.10,800 నుంచి రూ.11,200 వరకు ధర పలుకుతోంది. దిగుబడి పెరగకపోవడం, ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు జీడి చెట్లను కలపకు అమ్మేసుకుంటున్నారు. జీడి చెట్టు కలపను ఇటుక బట్టీలకు ఎక్కువగా ఉపయోగిస్తుండడంతో ఎంతో కొంత ఆదాయం వస్తుంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో జీడిమామిడి, మామిడి సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

**కూలి రేట్లు పెరిగాయి**



జీడి గింజలను ఒబ్బిడి చేయడం కష్టంతో కూడిన పని. చెట్ల కొమ్మలు కిందకు వేలాడుతుండటంతో జీడి పిక్కలు ఏరడానికి కూలీలు రావడం లేదు. కూలి రేట్లు కూడా పెరిగిపోయాయి. దిగుబడి లేకపోవడంతో రైతులు జీడిచెట్ల పెంపకంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో మాకు ఉన్న జీడిమామిడి తోటలను తొలగించి వాటి స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నాం.

– రాయి వెంకటరమణ, రైతు, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం.

**సాగు విస్తీర్ణం తగ్గుతోంది**



జీడిమామిడి పంట విస్తీర్ణం స్వల్పంగా తగ్గుతోంది. జీడిమామిడి సాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చు. రైతులకు జీడిమామిడి సాగు యాజమాన్య పద్ధతులపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. జీడిమామిడిలో దిగుబడి పెరిగితే ఆదాయం పెరుగుతుంది.

– శ్రీవల్లీ, ఉద్యానవన శాఖ అధికారి, ప్రత్తిపాడు

## బాధితులు అధైర్య పడొద్దు


సీహెచ్.అగ్రహారంలో బాధితులను పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**తుని రూరల్:** అగ్నిప్రమాదంలో ఇళ్లతో పాటు సర్వం కోల్పోయిన బాధితులు అధైర్యపడొద్దని, వారికి అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా మనోధైర్యం కల్పించారు. తుని మండలం దొండవాక శివారు సీహెచ్.అగ్రహారంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మదాసి సత్యవతి, సిరిసిపల్లి అమ్మాజీ ఇళ్లతో పాటు సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. బుధవారం దాడిశెట్టి రాజా ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ప్రమాదంలో విలువైన సర్టిఫికెట్లు కోల్పోయిన నూకరత్నాన్ని ఓదార్చారు. ప్రభుత్వం మంజూరు చేస్తే ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఇళ్లు మంజూరు చేయకపోతే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పక్క గృహాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కోల్పోయిన ఇళ్లు, ఆస్తులను మళ్లీ సంపాదించుకోవచ్చని, ప్రాణాలతో బయటపడడం అదృష్టమన్నారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలన్నారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. పార్టీ నాయకులు లంక సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, దాడిశెట్టి దేవుడు, శెట్టి శ్రీనివాసరావు, చింతల వెంకటరమణ, కీర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు మంచిని మాత్రమే నేర్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న స్వామి రామానంద

**ప్రత్తిపాడు రూరల్:** పిల్లలకు మంచిని మాత్రమే నేర్పించాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ ప్రచార ప్రముఖ్ నండూరి కృష్ణ సూచించారు. ప్రత్తిపాడులోని ముదునూరి మరళీ రాజు గెస్ట్ హౌస్ ప్రాంగణంలో బుధవారం బాల వికాస కేంద్రాల ప్రముఖ్ గుండు విశ్వనాథం మాస్టార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు దేవాలయాలు నిర్మించామన్నారు. ఈ ఆలయాల వద్ద నిర్వహిస్తున్న బాల వికాస కేంద్రాల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నియమ నిబంధనలతో చిన్నప్పటి నుంచి సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఆంధ్రా అరుణాచలం వ్యవస్థాపకులు స్వామిరామానంద తెలిపారు. బాల వికాస కేంద్రాల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సింగలి దేవి సత్తిరాజు, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ కుటుంబ ప్రభోదక్ పెమ్మరాజు రామచంద్రరావు, గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, బి.పేద్రాజు, పడాల రాంబాబు, తంగేళ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మిస్తారా ? గోడ కట్టుకోమంటారా?



రమణయ్యపేట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న వినోద్‌మిశ్రా పార్టీ శ్రేణులు

- రమణయ్యపేటలో గ్రామస్తుల ఆందోళన
- ఛిద్రమైన రహదారిపై రాస్తారోకో

**ఏలేశ్వరం:** కూటమి నేతలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా ఆక్రందనలు వినిపించడం లేదా ? చివరిసారిగా చెబుతున్నాం రహదారి నిర్మిస్తారా ? గోడ కట్టుకోమంటారా ? చెప్పండి అంటూ ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీశారు. రహదారిపై ప్రయాణించి ప్రమాదాల బారిన పడేకంటే గోడ కట్టుకొని మా ప్రాణాలు కాపాడుకుంటామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. మండలంలోని రమణయ్యపేట నుంచి ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారిని పునర్నిర్మించాలంటూ కోరుతూ బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్) వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో రమణయ్యపేట సమీపంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వినోద్‌మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఏజెన్సీ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు రహదారి నిర్మించకపోవడం దారుణమన్నారు. రహదారి గోతులమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రహదారి పునర్నిర్మించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమాల కుశల, నాగులాపల్లి అర్జునుడు, మసిరపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి
- తునిలో కౌన్సిల్ సమావేశం


మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

**తుని:** పట్టణాభివృద్ధికి సమష్టిగా కలిసి పని చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం భువన సుందరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో పొందుపరిచిన 42 అంశాలలో 34 అంశాలను ఆమోదించారు. మరో 8 అంశాలను వాయిదా వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కుచ్చర్ల పాటి రూపాదేవి, ఆచంట సురేష్, కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**చైర్మన్, వైస్ చైర్మన్లకు సత్కారం**

నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, వైస్ చైర్మన్ ఆచంట సురేష్‌లను వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సత్కరించారు. నిన్నటి వరకు అందరూ ఒకే పార్టీకి చెందిన వారు కావడంతో ఒకరికి ఒకరు ఆప్యాయతగా పలకరించుకున్నారు. పట్టణాభివృద్ధి విషయంలో అందరు కలిసి పని చేద్దామని ప్రకటించారు.

# అకాల వర్షంతో అవస్థలు


ఎస్.అన్నవరంలో కురుస్తున్న వర్షం


తుని మండల పరిధిలో నేల రాలిన మామిడి కాయలు


రామచంద్రపురంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్ కో సిబ్బంది

- ఆందోళన చెందుతున్న వరి రైతులు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

**గోకవరం:** మండలవ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఐదు గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి జనజీవనం పూర్తిగా స్తంభించింది. టార్గెట్ పేరుతో ధాన్యం కొనుగోలు కాకపోవడంతో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతులు భద్రపర్చుకోవడానికి పలు ఇబ్బందులు పడ్డారు. వేసవి తాపంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు భారీ వర్షానికి వాతావరణం చల్లబడటంతో సేదతీరారు.

**కిర్లంపూడి:** గత మూడు రోజులు కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల పరిధి రామచంద్రపురంలో పలు విద్యుత్ స్తంభాలు గాలికి పడిపోయి విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో సుమారు పది గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ చొరవతో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం కొత్తస్తంభాలు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అకాల వర్షం**

**తుని రూరల్:** మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలకు ఆకాశంలో ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఐదు గంటలకు భారీ వర్షం కురిసింది. వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్న ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. ఆరుతడి పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని, ఈదురు గాలులు లేకపోవడంతో మామిడి, జీడిమామిడి పంటలకు ఉపయోగకరమని వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు తెలిపారురు.

**నేల రాలిన మామిడి**

**తుని:** మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉక్కబోత నుంచి చల్లని గాలులు వీయడంతో ప్రజలు ఆస్వాదించారు. రెండు రోజులుగా వీచిన ఈదురు గాలులకు మామిడికి నష్టం కలిగింది. ఈ ఏడాది మామిడి కాపు అసలే అంతంత మాత్రంగా ఉంది. కాగా వర్షానికి పక్వానికి వచ్చిన కాయలు నేలరాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల్లో కోసి అమ్ముకుంటే అసలు వచ్చేదని, ఇప్పుడు అకాల వర్షం, గాలికి రాలిపోవడం వల్ల నష్టం కలిగిందని వాపోయారు.

**కుండపోత వాన**

**తొండంగి:** మండల వ్యాప్తంగా బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో చల్లదనానికి ప్రజలు సేదతీరారు. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురు గాలలతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షం, ఈదుర గాలుల ప్రభావానికి అరటి, మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. రబీ వరిపంట నూర్పిడి పనులకు అంతరాయం కలిగిందని బాధిత రైతులు వాపోయారు. పలు చోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు నేలకొరిగాయి.

## క్లుప్తంగా

### రిటైర్డ్ అధ్యాపకుడు రామ్మోహన్‌రావుకు సత్కారం


ముమ్మిడి రామ్మోహన్‌రావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

**కిర్లంపూడి:** మండలంలోని తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గణిత అధ్యాపకుడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ముమ్మిడి రామ్మోహనరావు దంపతులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎల్.కృష్ణ, జనసేన జగ్గంపేట కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో రామ్మోహనరావు దంపతులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోకేడ రాజా, కాయల మణికంత తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక వనరులుగా సంపద కేంద్రాలు


లింగంపర్తిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

**ఏలేశ్వరం:** పంచాయతీలకు ఆర్థిక వనరులుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని డీఎల్‌పీఓ బాలామణి సూచించారు. మండలంలోని లింగంపర్తిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలన్నారు. అంటురోగాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తుని:** విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. వీరవరపుపేట, సాయినగర్ ఇండోర్ సబ్‌స్టేషన్ల పరిధిలో బ్యాంకుకాలనీ, కొత్తపేట, కోర్టువీధి, బత్తాయితోట వీధి, రెడ్ కాన్వెంట్, దుర్గాదాస్ వీధి, సమితి ఆఫీసు వీధి, పార్కు సెంటర్, సినిమా రోడ్డు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, గణపతినగర్, మార్కండ్రాజుపేట, లయోలా స్కూల్ తదితన ప్రాంతాల్లో ఉదయం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

### విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రత్తిపాడు రూరల్:** విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ముక్కు సుబ్రహ్మణ్యం కోరారు. ప్రత్తిపాడులో బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ ఏరియర్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులకు సీనియర్ సిటిజన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.రామం, బి.అప్పారావు, ఏఎస్ఆర్ శేషగిరిరావు, సుబ్బారావు, ఎం.రాజారావు, బి.సత్యనారాయణ, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జరిమానా

**గోకవరం:** మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురు వ్యక్తులకు కోర్టు జరిమానా విధించిందని గోకవరం ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గోకవరంలో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురు వ్యక్తులను రాజమహేంద్రవరం సెకండ్ క్లాస్ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికీ రూ.పది వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 20 మంది వ్యక్తులను, శాంతి భద్రతలకు భంగం కలిగించిన 13 మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా జరిమానా విధించారన్నారు.

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం

**శంఖవరం:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌ల్లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

### ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు


ఏలేశ్వరం గ్రంథాలయంలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

**ఏలేశ్వరం:** పట్టణంలో బుధవారం శ్రీశ్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్ యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు శ్రీశ్రీ రచనలు, దేశభక్తిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

### సింహాచలం దుర్ఘటనకు నిర్లక్ష్యమే కారణం

వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు


ముద్రగడ గిరిబాబు

**కిర్లంపూడి:** సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడానికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవాల్లో భాగంగా స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులపై గోడకూలి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలుస్తానని హామి ఇచ్చే వరకూ కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం బాధకరమన్నారు.

### వేణుగోపాలస్వామికి మహాకుంభాభిషేకం


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

**కిర్లంపూడి:** స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక అష్టోత్తర మహాకుంభాభిషేక మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

### మండల అధికారుల నంబర్లు

**ఏలేశ్వరం:**

| | |
|---|---|
| తహసీల్దార్ | – 98499 03921 |
| ఎండీపీఓ కార్యాలయం | – 98493 36599 |
| ఎంఈఓ | – 94942 10420 |
| ఏపీఓ | – 70939 98217 |
| ఏపీఎం | – 73373 16825 |
| ఎస్సై | – 94409 04835 |
| మండల వైద్యాధికారి | – 99662 06287 |
| నగర పంచాయతీ కమిషనర్ | – 96520 65430 |
| మండల వ్యవసాయాధికారి | – 83310 56609 |
| ఫారెస్టు రేంజర్ | – 94403 28540 |

**కిర్లంపూడి:**

| | |
|---|---|
| తహసీల్దార్ | – 98499 03886 |
| ఎంపీడీఓ | – 91009 70617 |
| ఎంఈఓ | – 90009 12335 |
| ఎంఈఓ-2 | – 98487 43433 |
| ఏపీఓ | – 83744 46309 |
| ఏపీఎం | – 96523 04151 |
| ఎస్సై | – 94409 04834 |
| కిర్లంపూడి వైద్యాధికారి | – 77024 41029 |
| వీరవరం వైద్యాధికారి | – 89193 43269 |
| గెద్దనాపల్లి వైద్యాధికారి | – 81066 28018 |
| మండల వ్యవసాయాధికారి | – 83310 56601 |
| కిర్లంపూడి పశువైద్యాధికారి | – 89580 44698 |
| భూపాలపట్నం పశువైద్యాధికారి | – 95429 08025 |
| వీరవరం పశువైద్యాధికారి | – 89789 41840 |
| హౌసింగ్ ఏఈ | – 70939 30461 |
| ఇంజినీరింగ్ అధికారి | – 97014 77778 |

### మండల అధికారుల నంబర్లు

**కోటనందూరు:**

| | |
|---|---|
| తహసీల్దార్ | 80088 03205 |
| ఎంపీడీఓ | 98496 63415 |
| మండల వైద్యాధికారి | 76750 32399 |
| వ్యవసాయాధికారి | 83310 56617 |
| ఎంఈఓ-1 | 89856 02864 |
| ఎంఈఓ-2 | 96529 81857 |
| కోటనందూరు పశువైద్యాధికారి | 86398 13895 |
| పాతకొట్టాం పశువైద్యాధికారి | 94919 34613 |
| ఎస్సై | 94409 00773 |
| వెలుగు ఏపీఎం, | 80088 04895 |
| ఉపాధిహామీ ఏపీఓ, | 70939 98217 |